


# సర్పశిల

### – భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

*ఇప్పటివరకూ జరిగిన కథ*

*ఓ అడవిలోనున్న ఆలయం దగ్గర మొదలైన కథ, 'రాబీ వెబ్‌స్టర్ ' అనే అమెరికన్ ఇండియాలో దిగడంతో ఓ మలుపు తిరుగుతుంది. 'తక్షపురం 'లోని సర్పశిల ఒక మలుపుకి సంకేతమైతే 'నల్లమల 'లో జరిగిన విశ్వశాంతి యజ్ఞం మరో మలుపు. ఒక వైపున కొన్ని శక్తులు ప్రకృతి విధ్వంసానికి రచన చేస్తూంటే మరోవైపు ప్రకృతి రక్షకులు ప్రకృతిని కాపాడే ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంటారు. అనేకానేక పాత్రలు తమ విధిని నిర్వర్తిస్తూవుంటాయి. అందరి లక్ష్యమూ ఒకటే - విశ్వశాంతి.*

**ఏనాడూ భయపడని మట్టూకి** యీనాడు భయం అంటే తెలిసివొస్తోంది. దూరం నించి బాగానే కనిపించిన గట్టు కొంతదూరం నడవగానే, కేవలం పాదం ఆనించే వెడల్పుతో ఉంది. దానిమీద కాలు ఆనిస్తే అగాధంలాంటి జలంలోకి జారిపోవడం ఖాయం. వెనక్కిపోవాలన్నా భయమే. ఎందుకంటే నడిచి వచ్చేప్పుడు దారి శరీరం బరువుకి బెసికింది.

క్షణానికోసారి దైవాన్ని తలుచుకుంటూ ముందుకి పోతున్నాడు మట్టూ. అతి జాగ్రత్తగా పాదం ముందు పాదం ఆనేట్టు నడుస్తూ గట్టుని గమనిస్తున్నాడు.

ఏ ఆలోచన మనసులోకి వచ్చినా ఏకాగ్రత చెడిపోయి నీటిపాలవుతానని తెలుసు. ఓ ఇరవై గజాలు దాటాక మళ్ళీ గట్టితనం కలిగిన గట్టు.. మళ్ళీ సన్నటి పాములా వంకర తిరిగినగట్టు. మనసంతా లగ్నం చేసి నడుస్తున్నాడు మట్టూ.

నీళ్ళలో శబ్దం. ఓ క్షణం ఆగి ఇటూ అటూ చూశాడు. పాములు.. పొడుగాటి ఆకుపచ్చ, పసుప్పచ్చ, నలుపు గోధుమ రంగు పాములు. నీళ్ళలో యీదుతూ వస్తున్నాయి.

అవి గట్టు మీదకి వస్తాయా? తనని కరుస్తాయా? లేక పగబట్టాయా? ఇది అమ్మవారి సంకల్పమా, వీటి బారినపడి మృత్యువు పాలవడం? రకరకాల ఆలోచనలు మట్టూ మనసులో తుఫానులా చెలరేగాయి.

మళ్ళీ ఓ ఆలోచన. ఉహూ.. ప్రాణం పోయినా నా సంకల్పం బలహీనపడకూడదు. బొడ్లోవున్న కత్తిని చేతితో పట్టుకుని, మనసు కూడగట్టుకుని నడక సాగించాడు మట్టూ. గురువు అశీర్వాదం ఉంటే, సర్వం సిద్ధిస్తుందని అతని నమ్మకం. నడుస్తూనే ఉన్నాడు. గట్టి చోటు ఉన్నప్పుడు పాముల్నీ గమనిస్తున్నాడు. అవి యీదుకుంటూ వస్తూనే ఉన్నాయిగానీ, గట్టుమీదకి వచ్చే ప్రయత్నం అవి చెయ్యలేదు. మరో ఆలోచనకి తావివ్వకుండా ముందుకు సాగుతున్నాడు మట్టూ. గంటలు గంటలు కాలం గడిచిపోతూనే వుంది. ఓ పక్క భయంకరమైన ఎండ. మరో పక్క అతను వేగం పెంచినప్పుడు వేగం పెంచుతూ, వేగం తగ్గినప్పుడు వేగాన్ని తగ్గిస్తూ యీదుతున్న పాములు.

దూరంగా ఆవలిగట్టు కనిపిస్తోంది. అయితే ఏభై అరవై గజాల గట్టు కనిపించలా. అయినా అరవైగజాలూ యీదితేగానీ ఆవలిగట్టుకు చేరలేననే నిర్ణయానికి వచ్చాడు మట్టూ. దగ్గరికి వెళ్ళాక తాను అనుకున్నది నిజమైంది. ఓ ఏభై గజాలు ఏ గట్టూ లేదు. కొట్టుకుపోయివుంటుంది. లోతు మరీ ఎక్కువగా లేదు. కానీ ఎలా యీదడం? పాములు వదులుతాయా? నీరసం నిస్సత్తువ ఆవహించిందాతనకి. కూలబడే చోటులేదు. నిలబడటానికి ఓ రెండు గజాల తరవాత గట్టుండదు. సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు.

వర్షపు నీరు ఆవిరై ఆకాశానికి పయనించిందేమో ఉత్తర దిశలో మబ్బులు 'ఉత్తర వాన ఎత్తర గంప' అనే మాట గుర్తొచ్చింది అతనికి. మళ్ళీ ఓ భీకరమైన వర్షం మొదలైతే.

హఠాత్తుగా నీడలు. పైకి చూస్తే దూసుకొస్తున్న గద్దల గుంపు. చుట్టూ చూశాడు. గద్దల నీడ పడగానే పాములు నీళ్ళలోకి మాయమయ్యాయి. పిచ్చి ధైర్యంతో నీటిలోని బుడుంగున దూకాడు మట్టూ.

ఆ గద్దలు పాముల్ని పట్టుకోలేక నిరాశగా వెళ్ళి పోకముందే ఆ జలసంధిని దాటాలనే పిచ్చి ఆవేశం వచ్చిందతనికి. అతివేగంగా బారలు చాస్తూ యీదటం మొదలెట్టాడు మట్టూ.. పది.. ఇరవై..ముప్పై..నలభై...బారలు బారలుగా యీదుతూ గట్టుని సమీపిస్తున్నాడు మట్టూ. ఓ పక్క తిండిలేక నీరసం. అయినా గట్టునెక్కి నేలమీద వెల్లకిలా పడుకున్నాడు మట్టూ. ఆకాశం నిండా మేఘాలే.

"హాజీ జియా ముస్తఫిజూర్ కబురు పెట్టారు. ఓసారి ఒంటరిగా వెళ్ళి కలిస్తే మంచిది" అన్నారు. పుండరీకాక్షుడు వాసుదేవ్‌తో. ఆశ్చర్యంగా చూశాడు వాసుదేవ్.

"ఆయన అత్యంత అవసరం అయితే కబురు పెట్టరని నీకూ తెలుసుగా" అన్నాడు పుండరీకాక్షుడు.

"తెలుసు. డ్రెస్ వేసుకోబోతువాడల్లా డ్రెస్ పక్కన పెట్టి సివిల్ డ్రెస్ తీస్తూ అన్నాడు వాసుదేవ్.

"ఇదే మంచిది. పోలీస్ పటాలంతో వెళ్ళడంకంటే" నవ్వాడు పుండరీకాక్షుడు.

"మీరన్నది నిజమేసార్. కానీ, సివిల్‌డ్రెస్‌లో వెళ్ళడం క్షేమంకాదండి. మీకు తెలీనిదేముందీ అన్నాడు అచ్యుతనారాయణ్.

పుండరీకాక్షుడు ఏదో చెప్పబోయి ఆగిపోయాడు.

"చెప్పునాన్నా" అన్నాడు వాసుదేవ్.

"అచ్యుత్ చెప్పిందీ నిజమే. పోలీస్ గనక జాగ్రత్తలు తీసుకు తీరాలి. నువ్వు నార్మల్‌గా వెడితే, స్వీయ రక్షణ చాలా చాలా కష్టం అవుతుంది" అన్నాడు పుండరీకాక్షుడు.

"కష్టం అయినా నష్టం అయినా వెళ్ళి తీరాలి. ఓ పని చేస్తాను. డైరెక్టుగానే వెడతా. సివిల్ డ్రెస్‌లో వెళ్ళినా పోలీస్ జీప్‌లోనే వెడతా. ఆయన్ని కలిసేది మాత్రం ఒంటరిగా కలుస్తా. ఆయన చెప్పబోయేది నేను వెదుకుతున్నదీ ఒకటే కావొచ్చు" స్థిరంగా చెప్పాడు వాసుదేవ్. జవాబు చెప్పకుండా 'సరే' అన్నట్లుగా తలపంకించాడు పుండరీకాక్షుడు. ఏవేవో ఆలోచనలు ఆయన మనసులో కదుల్తున్నాయి.

"ఏమిటీ ఆలోచిస్తున్నారూ?" అడిగింది సౌభాగ్యలక్ష్మి. ఆవిడ వాసుదేవ్ తల్లి, పుండరీకాక్షుడి భార్య, వాసుదేవ్ వెళ్ళాక.

"పొరబాటు చేశానా అని అనిపిస్తోంది. పోలీసు డిపార్ట్‌మెంట్‌లో ఉండీ, అందులోని కష్టనష్టాలు తెలిసీ, వాసుదేవ్ తను అదే డిపార్ట్‌మెంట్‌లోకి వెడతానంటే, నేను ఒప్పుకోవడం ఇప్పుడు తప్పనిపిస్తోంది. సౌభాగ్యం, మేము నిరంతరం గడిపేది దొంగలతోటి, హంతకులతోటీ, మదోన్మాదులతోటీ, తీవ్రవాదులతోటీ, తెలిసీ తెలియకుండా ఏదో పోరాటాన్ని సాగిస్తున్నామనే భ్రమలో, కొందరి చేతుల్లో పావుల్లా మారుతున్న యువకులతోటీ, కొందరు చిత్తశుద్ధిలేని అధికారులతోటీ, తమ స్వార్థం తప్ప ఏమాత్రం దేశం కోసం పనిచెయ్యని, దేశం యొక్క పురోగతి గురించి పట్టని రాజకీయ వాదులతోటీ నాయకులతోటీ. వీళ్ళుగాక కరుడుగట్టిన విదేశీ గూఢచారులు టెర్రరిస్టులు" ఆగారు పుండరీకాక్షుడు.

"ఎంతటి అమాయకుడికైనా యీ డిపార్టుమెంటులో కొచ్చాక హృదయం గడ్డకట్టకమానదు. మన అదృష్టం ఏమంటే మన వాసుదేవ్ చక్కని సంస్కారం గలిగినవాడు. కానీ, ప్రమాదం పొంచి ఉండేది ఇటువంటివారికే. ఎందుకంటే, వాసులాంటివాళ్ళు పై అధికారుల ప్రాపుకోసం పాకులాడరు. అధికారం కోసమో, అహంకారంతోనో అన్యాయం చెయ్యరు, చెయ్యలేరు." తలపంకిస్తూ సౌభాగ్యలక్ష్మిని చూసి అన్నారు పుండరీకాక్షుడు. చల్లగా నవ్వింది ఆమె.

"మీకు నేను చెప్పదగినదానినికాదు. అరాచకాల్ని అణచడానికేగా యుగానికో అవతారం ఎత్తుతానని శ్రీ మహా విష్ణువు కృష్ణావతారంలో, గీతలో బోధించింది. భగవంతుడు అవతారం ఎత్తాలంటే మానవ అవతారమే ఎత్తాలి. మానవుడిలాగే ప్రవర్తించాలి. వాసుదేవ్ నా దృష్టిలో కొడుకు మాత్రమే కాదు, దేశాన్నీ, రాష్ట్రాన్నీ, ప్రజల్నీ రక్షించడానికి పుట్టిన గొప్ప బిడ్డ. తెలుగు బిడ్డ.. భరతమాత బిడ్డ. మీరేమీ చింతించకండి. ఆ అమ్మ ఆశీస్సులు మన బిడ్డకి ఎప్పుడూ వుంటాయి. పదండి.. హాయిగా స్నానం చేసి వస్తే చక్కని టిఫిన్ పెడతాను" చక్కగా నవ్వుతూ ఆయనకు తువ్వాలు అందించింది సౌభాగ్యలక్షి .

"థేంక్స్" మనస్ఫూర్తిగా అన్నాడు పుండరీకాక్షుడు. హాయిగా నవ్వింది సౌభాగ్యమ్మ. పెళ్ళయిన తరవాత పుండరీకాక్షుడు చెప్పిన మొదటి 'థాంక్స్' ఇది.

"బేటా... నేను ఎక్కువకాలం ఉంటానని అనుకోను. కొన్ని విషయాలు చెప్పాలి. నేను పుట్టిందీ పెరిగిందీ హైదరాబాదులోనైనా మా పూర్వీకులు నివశించింది 'హుంజా' వేలీలో అదిప్పుడు ప్రస్తుతం పాకిస్తాన్ దగ్గర ఉన్నా, మేము ఏనాడూ ఏ మతంవారినీ కించపరచలేదు. ఆ చోటుకి దగ్గర్లోనే 'బిర్మాయీ' అనే గ్రామం ఉన్నదిట. ఆ గ్రామంలో భీమసేనుడు తిరిగాడని మా పూర్వీకులు అంటారు. 'బిర్మాయీ' పేరు కూడా 'భీమాయీ' నించి రూపాంతరం చెంది బిర్మాయీ అయింది. ఒకప్పటి పాటలీపుత్రం పాట్నా అయినట్టు, లవపూర్ 'లాహోర్' అయినట్టూ. నేనాగ్రామాన్ని నా చిన్నతనంలో చుశా. నాయనా! మతం, కులం మనిషి సృష్టించుకున్నవి. దేవుళ్ళని బట్టి మతాలు ఏర్పడితే, వృత్తిని బట్టి కులాలు ఏర్పడ్డాయి. అయినా, ఆ సంగతి అవతల పెడదాం. నా ఆఖరి కొడుకుకు ఓ కొడుకు పుట్టాడు. వాళ్ళు నివశించేది పురానా ఢిల్లీలో. వాడి పుటుక ఓ విచిత్రమైనది. వాడు పుట్టిన పన్నెండు నెలలలోగా మా పూర్వుడైన 'హూంజా మీర్' మరణిస్తాడు అంటారు. ఆ విషయం హుంజా మీర్‌గారే స్వప్నంలో అనేకసార్లు విన్నారని చెప్పారు. ఇప్పుడా శిశువు తండ్రి మహా కాళేశ్వర్‌లో ఉన్నాడని నా కోడలు చెప్పింది."

ఆగాడు హాజీ జియా ముస్తఫిజుర్. అదివరకు చూసిందానికన్నా ఆయన డస్సిపోయినట్టు గుర్తించాడు వాసుదేవ్.

"బాబాయ్..." చెప్పబోయాడు వాసుదేవ్.

"ఆపొద్దు నాన్నా. ఉర్దూ, అరబిక్ ఎంత శ్రద్ధగా పఠించానో తెలుగూ అంతే ప్రేమగా చదివాను. మీ నాన్నగారూ నేనూ స్నేహితులం మాత్రమే కాదు.. సహోదరుల్లాంటివారం. మీ అమ్మగారి చేతివంట ఎన్నిసార్లు తిన్నానో లెక్కలేదు." మళ్ళీ ఆగారు హాజీ సాబ్. వాసుదేవ్ ప్రేమతో ఆయన చేతిని పట్టుకున్నాడు. హాజీగారి భార్య పనిపిల్లతో టీ పంపించింది. టీ పూర్తయ్యేవరకూ హాజీ జియా ముస్తఫిజుర్ ఏమీ మాట్లాడలేదు.

ఆ తరవాత తలుపులూ కిటికీలు వేసేసి, "వాసుదేవ్.. మాకందరికీ పూజ్యుడైన హూంజామీర్ ఓ లిఖిత పత్రాన్ని మా తండ్రిగారికి ఆయన చిన్నతనంలో ఇచ్చారు. ఆ పత్రం నాదగ్గర ఉంది. అందులోని విశేషాలు మాత్రం నీకు చెప్పగలను. పత్రం మా హుంజావేలీలో వాడే హుంజా భాషలో ఉన్నది గనక నేనిచ్చినా ఉపయోగంలేదు. నిజం చెబితే అందులోని రహస్యం ఎవరికీ చెప్పకూడదు. కానీ, మనం ముందు మనుషులం. తరవాతే కుల మతాలు. సరే, ఒక్కమాటలో చెప్పాలంటే, మహాభారత కాలం నాటి 'శకుని' మళ్ళీ పుట్టాడు. అదీ నా మనవడుగా." ఆగాడాయన.

"శకుని మళ్ళీ పుట్టాడా?" షాక్‌తో అన్నాడు వాసుదేవ్.

"వాసూ, మహాభారతం మనుషుల మధ్య, సైనికుల మధ్య కౌరవ పాండవుల మధ్య జరిగిన యుద్ధమేకాదు. వ్యక్తుల కంటే వ్యక్తిత్వాల మధ్య, అహంభావ అహంకారాల మధ్య జరిగిన యుద్ధమది. శరీరాలు పంచభూతాల్లో కలిసిపోయినా

అహంకారం నిండిన ఆత్మలు పరమాత్మలో లీనమవలేదు. ఒక ముసల్మాన్‌గా నేను ఇలా మాట్లాడుతున్నానని అనుకోకు. నా ముగ్గురు భార్యల్లో ఒకరు నేను అత్యంత ప్రేమించి పెళ్ళి చేసుకున్న బ్రాహ్మణ స్త్రీ. ఇప్పుడు ఢిల్లీలో వున్న నా ఆఖరి కొడుకు పెళ్ళి చేసుకున్నది మతం మార్చుకుని ఇస్లాం తీసుకున్న హిందువునే. ప్రేమకూ, ద్వేషానికీ కూడా కులమతాలు అడ్డుపడవు. ప్రేమవల్ల శాంతి దొరికితే, ద్వేషంవల్ల రక్తపాతం జరుగుతుంది. బాబూ, నువ్విప్పుడు పరిశోధిస్తున్న విషయాలన్నీ ఓ భయంకర ఉత్పాతానికి ముందొచ్చే సంకేతాలే. నిజం చెబితే ఇవికాదు ముఖ్యమైనవి. రాబోయే అనూహ్య ఘటనలు. మానవ ప్రయత్నం మాత్రమే వాటిని ఆపలేదు. సంపూర్ణ మానవ ప్రయత్నంతో పాటు దైవకృపకూడా ఉండాలి" మళ్ళీ ఆగారు హాజీ సాబ్.

"ఒక శకుని పుట్టుక అన్ని ఉత్పాతాలకి  కారణం అవుతుందా?" కుతుహలంగా అడిగాడు వాసుదేవ్.

"ఒక అణువు.. అల్పాతి అల్పమైన అణువు యొక్క విస్ఫోటనం ఎంత సర్వనాశనానికి కారణం అవుతుందో సైన్సు చదువుకున్న నీకు తెలియందా వాసూ? ఈ సృష్టిలో ఏదీ ఒక్కటిగా పుట్టదు. నీ పుట్టుక జరగాలంటే నీ తల్లిదండ్రుల పుట్టుక జరగాలి. వారి తల్లిదండ్రుల పుట్టుక కూడా జరగాలి. అంతేకాదు, నీకు ఎవరెవరుగా బంధువులుండాలో, ఎవరెవరు స్నేహితులుగా, గురువులుగా, పరిచయస్తులుగా ఉండాలో వారందరూ కూడా జన్మించాలికదా! అలాగే సహోద్యోగులు, అలాగే నీ భార్యా బిడ్డలు కూడా జన్మించాలిగదా! అందుకే ఎవరూ ఒంటరిగా పుట్టలేరు. ప్రతి జన్మకీ ఓ అర్ధం, విశేషార్ధం, గూఢార్ధం ఉంటాయి" అలసటగా ఆగారు హాజీ సాబ్.

"మీరు విశ్రాంతి తీసుకోండి బాబా. నేను మళ్ళీ మళ్ళీ ఎన్నిసార్లు రమ్మన్నా వస్తాను" అన్నాడు వాసుదేవ్ వినయంగా.

"బాబూ చెప్పాల్సినదాన్ని నోరు సరిగ్గా ఉన్నప్పుడే చెప్పాలి. వినాల్సిన దాన్ని చెవులు బాగా ఉన్నప్పుడే వినాలి. చూడాల్సిన దాన్ని కనులకు మసకలు రాకముందే చూడాలి. చేయాల్సిన దాన్ని చేతులు చచ్చుబడకముందే చెయ్యాలి. నేను చెప్పింది అణువంతే! అదో రహస్యంగా కాపాడబడుతోంది. ఎందుకో నాకూ తెలీదు" అన్నారు హాజీసాబ్.

"కాదు బాబాయ్.. ఇది ఇప్పుడు స్పష్టపడే విషయం కాదు. మీరు అన్నదాన్ని బట్టి నాకు అర్ధమైనదేమంటే, శకుని పుట్టుకకు ముందే వేదిక సిద్ధమయి ఉండాలి. కొన్ని శక్తులు ఇంకా జన్మ తీసుకోవాలి. స్థూలంగా తీసుకుంటే, ఇందులో ఏదీలేదు. సూక్ష్మంగా చూస్తే ఒక మహా శక్తి మానవాళికో ముప్పు తెచ్చే విధంగా సుడులు తిరుగుతూ వస్తోంది. ఒక్కటి నిజం, యీ వార్త నేను ఊహించనిది" అన్నాడు వాసుదేవ్.

"నాయనా, శకుని ఆనాటి జన్మ స్థలంగా గాంధారం. దానిపేరు ఇప్పుడు కాంధహార్. నీకు గుర్తుంటే, కొందరు కరుడు గట్టిన ఉగ్రవాదుల్ని మనం విడిచి పెట్టాల్సి వచ్చింది. నిన్నటి శత్రువు నేటికీ బ్రతికున్నాడంటే అర్ధం ఏమిటీ?

పుంజుకుని మరోసారి విజృంభిస్తాడని అర్థం. ఆ విజృంభణ ఇప్పుడు యీ క్షణంలో జరక్కపోవచ్చు. కానీ ప్రయత్నాలు ఎప్పటినించో జరుగుతూనే ఉండాలిగా!"

నిర్వేదంగా అన్నాడు హాజీ జియా ముస్త ఫిజూర్. వాసుదేవ్ వంగి ఆయన పాదాలకు నమస్కరించి, సెలవు తీసుకుని బయటకొచ్చాడు.

చాలామంది కళ్ళు జీప్ మీదా, బయటకొస్తున్న తనమీదా ఉండటం గమనించినా గమనించనట్టు జీప్ ఎక్కాడు వాసుదేవ్.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments